
సాక్షి
గుంటూరు
గురువారం | 25 | జూలై | 2024




ఎస్పీకి హిందూ చైతన్య వేదిక వినతి

నగరంపాలెం(గుంటూరు): వేంకటేశ్వరస్వామి సుప్రభాతాన్ని కించపరిచిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని హిందూ చైతన్య వేదిక సభ్యులు ఎస్పీ సతీష్‌కుమార్‌కు బుధవారం విన్నవించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ నీటిమట్టం బుధవారం 503.50 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 5,882, ఎడమ కాలువకు 2,765 క్యూసెక్కులు విడుదలవుతోంది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 2304 క్యూసెక్కులు విడుదల చేశారు.

న్యూస్‌రీల్

టౌన్ ప్లానింగ్ ఏసీపీగా అంజనా జేమ్స్



మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ ఏసీపీగా అంజనా జేమ్స్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఏసీపీగా పనిచేసిన వెంకటేశ్వర్లు బదిలీ కాగా ఆయన స్థానంలో అంజనా జేమ్స్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు టౌన్‌ప్లానింగ్ అధికారులు. సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రణాళికా విభాగం అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవన్నారు. అనధికార కట్టడాల నిర్మూలనతో పాటు కార్పొరేషన్ ఆదాయం పెంచి నగరాన్ని అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

పోస్టాఫీసుల ద్వారా మెరుగైన సేవలు

మంగళగిరి: పోస్టాఫీసుల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించనున్నట్లు విజయవాడ రీజినల్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసమూర్తి చెప్పారు. పోస్టల్ సేవలు గడపగడపకు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ర్యాలీని బుధవారం ఆయన పట్టణంలో ప్రారంభించారు. శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ పోస్టాఫీసుల ద్వారా పాస్‌పోర్టు, ఆధార్, రైల్వే బుకింగ్, కరెంట్ బిల్లులు చెల్లింపులు తదితర సేవలు అందిస్తున్నట్టు వివరించారు. మహిళలకు ప్రత్యేకంగా మహిళలు సేవింగ్స్ ఖాతాలు, బాలికలకు సుకన్య సేవింగ్స్ ఖాతాలతో అధిక వడ్డీ పొందవచ్చని వెల్లడించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పోస్టుమాస్టర్ రాధాకృష్ణమూర్తి, పోస్టుమాస్టర్ ఎం.నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణ

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): గుంటూరు పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని పట్టణ, గ్రామాలలోని లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్ కలిగిన(కారు, జీపు) డ్రైవర్లకు ఆర్టీసీ తరుపున హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ గుంటూరు 2 డిపో మేనేజర్ ఎస్‌కే అబ్దుల్ సలాం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 15 బ్యాచ్‌లకు శిక్షణనిచ్చినట్టు వెల్లడించారు. 16వ బ్యాచ్ కోసం అడ్మిషన్లు ప్రారంభించామని వివరించారు. ఒక బ్యాచ్‌కు 16 మందికి మాత్రమే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 8897371003, 7382894585 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

యార్డుకు 48,776 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 48,776 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 45,150 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 16,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 18,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 9,000 నుంచి రూ. 15,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,500 నుంచి రూ. 18,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 18,160 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

విఘ్నేశ్వరునికి విశేష పూజలు



తెనాలి: ఆషాఢ మాసం బుధవారం సంకటహరచతుర్థి సందర్భంగా వివిధ దేవాలయాల్లో శ్రీ విఘ్నేశ్వరుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలాజీరావుపేటలోని సిద్ధి విఘ్నేశ్వర మందిరంలో అర్చకుడు మల్లికార్జునరావు ఆధ్వర్యంలో స్వామివారికి విశేష అలంకరణ చేసి, అభిషేకం, పూజలు చేశారు. అలాగే మారీసుపేటలోని కోదండ రామస్వామి దేవస్థానం (అప్పలస్వామి గుడి) లోనూ విశేష పూజలు జరిగాయి. మనం నిత్య జీవితంలో ఏ కార్యం మొదలు పెట్టినా ముందుగా గణపతికి పూజలతో మొదలుపెడతామని, ఆషాఢమాసం బుధవారం విశేషమైన రోజని ఆలయ ధర్మకర్తల్లో ఒకరైన లంకా శివానంద్ అన్నారు. స్వామివారిని దర్శించి ఆశీస్సులు పొందటం శుభసూచికమన్నారు. ఆలయ ధర్మకర్తలు కూనపల్లి నారాయణ స్వామి, లంక శివానందకుమార్, లంక శివాంజనేయ ప్రసాద్, అర్చకులు ధనమని ధనుష్సుబ్రహ్మణ్య శర్మ, భక్తులు పాల్గొన్నారు .



'లైన్' క్లియర్

కూ..త ఘనం

- అమరావతి కొత్త రైల్వే లైన్‌కు ఆమోదం
- రాజధాని నుంచి వెళ్లేలా ప్రణాళిక
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 12 అమృత్ స్టేషన్లు
- లోడింగ్‌లో డివిజన్ అగ్రస్థానం
- అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి
- కేంద్ర రైల్వే బడ్జెట్‌పై డీఆర్‌ఎం రామకృష్ణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు డీఆర్‌ఎం రామకృష్ణ

సాక్షి ప్రతినిధి, గుంటూరు, లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో అమరావతి రాజధాని మీదుగా కొత్త రైల్వే లైన్‌కు కేంద్రం బడ్జెట్‌లో ఆమోదం తెలిపింది. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం నుంచి కొండపల్లి, కృష్ణానది మీదుగా అమరావతి–నంబూరు మీదుగా ఈ రైల్వే లైన్‌ను వేయనున్నట్టు గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ తెలిపారు. ఆయన బుధవారం విలేకరుల సమావేశంలో ప్రస్తుతం మంజూరైన రైల్వేలైన్, స్టేషన్ల అభివృద్ధి పనులతోపాటు ఇప్పటికే పురోగతిలో ఉన్న డబ్లింగ్, ఇతర పనుల గురించి వివరించారు. సమావేశంలో సీనియర్ డీఓఎం దినేష్‌కుమార్, డీసీఎం కమలాకర్‌బాబు, సీనియర్ డీఈఎన్ కో–ఆర్డినేషన్ జె.వి.అనూషా, సీనియర్ డీఈఈ సూర్యనారాయణ పాల్గొన్నారు. డీఆర్‌ఎం చెప్పిన వివరాల ప్రకారం.. అమరావతి రాజధాని లైన్ ప్రాజెక్టుకు పూర్తి ప్రణాళిక ఇప్పటికే రైల్వేశాఖ రూపొందించింది. భూసేకరణ నోటిఫికేషన్ కూడా త్వరలో విడుదల చేయనుంది. ఎంతమేరకు నిధులు మంజూరు చేస్తారనేది త్వరలో తెలియనుంది.

గుంటూరు–బీబీనగర్ మధ్య డబ్లింగ్

గుంటూరు నుంచి బీబీనగర్ మధ్య డబ్లింగ్‌కు రూ.2,853 కోట్లతో అంచనాలు రూపొందించారు. ఈ ప్రాజెక్టు రెండు తెలుగు రాష్ట్రాలకు ప్రయోజనకరంగా ఉంటుంది. దీనిలో మన రాష్ట్రంలో 104 కిలోమీటర్ల మేర డబ్లింగ్ లైన్ జరుగుతుంది. తెలంగాణలో 178 కిలోమీటర్ల మేర పనులు జరుగుతాయి. ఈ పనులు 2023 ఆగస్టులో మంజూరయ్యాయి. భూ సేకరణ చేయాల్సి ఉంది. నడికుడి – శ్రీకాళహస్తి ప్రాజెక్టులో భాగంగా ఇటీవల గుండ్లకమ్మ, దర్శి మీదుగా సింగిల్ లైన్ పనులు పూర్తయ్యాయి. రైళ్ల రాకపోకలు జరుగుతున్నాయి. అంతకుముందే నడికుడి నుంచి గుండ్లకమ్మ వరకు లైన్ పూర్తయింది. నడికుడి నుంచి గుండ్లకమ్మ వరకు గూడ్స్ రైళ్ల రాకపోకలు జరుగుతున్నాయి. దర్శి నుంచి పొదిలి వరకు లైన్ వేసే పనులకు ప్రణాళికలు రూపొందించారు. ఈ లైన్ పూర్తికి రైల్వేశాఖ కసరత్తు చేస్తోంది. భూ సేకరణ కీలకంగా ఉంది.

డివిజన్‌లో 16 అమృత్ స్టేషన్లు

గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో అమృత్ భారత్ స్టేషన్లుగా పనులు మంజూరైన స్టేషన్లు 16 ఉండగా ఇందులో 14 మన రాష్ట్రంలో, రెండు తెలంగాణలో ఉన్నాయి. ఇందులో ఉమ్మడి గుంటూరు జిల్లాలో 12 ఉన్నాయి. మొత్తం 16 రైల్వే స్టేషన్లలోనూ అభివృద్ధి పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఈ పనులు వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి చేయడమే లక్ష్యంగా అధికారులు పెట్టుకున్నారు. 9 స్టేషన్లలో ఫుట్ ఓవర్‌బ్రిడ్జిలను నిర్మించనున్నారు.

అభివృద్ధిలో బెస్ట్ గుంటూరు డివిజన్

గత ఏడాది గుంటూరు డివిజన్ పనితీరు చాలా బాగుందని రైల్వేశాఖ అభినందించింది. 20 ఏళ్ల రికార్డును బ్రేక్ చేస్తూ గుంటూరు రైల్వే డివిజన్ 3.365 మిలియన్ల లోడింగ్‌తో అగ్రస్థానం సాధించింది. రూ.409 కోట్ల ఆదాయం సాధించింది. ఇది గర్వకారణం. ఈ ఏడాది నాలుగు మిలియన్ల టన్నుల లోడింగ్‌ను లక్ష్యంగా పెట్టుకున్నాం. రూ. 450 కోట్ల ఆదాయమే లక్ష్యం. సమష్టి కృషితో దీనిని సాధిస్తాం.

– రామకృష్ణ, డీఆర్‌ఎం, గుంటూరు రైల్వే డివిజన్

పూర్తికావచ్చిన డబ్లింగ్ పనులు

గుంటూరు డివిజన్‌లో ప్రధానంగా గుంతకల్ డబ్లింగ్ ప్రాజెక్ట్‌లో గుంటూరు–గిద్దలూరు, డబ్లింగ్ పనులు పూర్తయి రైళ్ల రాకపోకలు ప్రారంభమయ్యాయి. గిద్దలూరు నుంచి దిగువ మెట్ట స్టేషన్ వరకు 15 కిలోమీటర్ల మేర డబ్లింగ్ పనులూ పూర్తి కావొచ్చాయి. ఈ ఏడాది ఆగస్టులోగా పనులు పూర్తి చేసి గిద్దలూరు–దిగువ మెట్ట మీదుగా రైళ్ళ రాకపోకలు జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మధ్యలో కొన్ని టన్నెల్స్ నిర్మాణంలో ఉండటం వల్ల కొంత సమయం పట్టింది. దిగువ మెట్ట నుంచి చల్లమా వరకు ఉన్న టన్నెళ్లను వచ్చే ఏడాది పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. గుంతకల్ వైపు నుంచి నంద్యాల వైపు గుంతకల్– బుగ్గానపల్లి డబ్లింగ్ పనులు పూర్తయ్యాయి. బుగ్గానపల్లి నుంచి నంద్యాల వరకు మధ్యలో ఉన్న డబ్లింగ్ పనులు ఈ ఏడాది సెప్టెంబర్, నవంబర్‌లోగా పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు.

వాడరేవు–పిడుగురాళ్ల హైవే

బాపట్లకు మణిహారం



జాతీయ రహదారి మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

- భూములు కోల్పోయిన వారికి త్వరలో పరిహారం అందజేత
- కలెక్టర్ జె.వెంకట మురళి

చీరాల టౌన్: వాడరేవు నుంచి పిడుగురాళ్ల వరకు నిర్మిస్తున్న 167–ఏ జాతీయ రహదారి త్వరలోనే వినియోగంలోకి తీసుకొచ్చేందుకు అన్ని ఏర్పాట్లు తీసుకుంటున్నామని కలెక్టర్ జె.వెంకట మురళి పేర్కొన్నారు. ఈ జాతీయ రహదారి వినియోగంలోకి వస్తే జిల్లా రూపురేఖలు మారి అభివృద్ధి పథంలో నడుస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన బుధవారం వాడరేవు రోడ్డులో హాయ్ రెస్టారెంట్ సమీపంలో జరుగుతున్న నిర్మాణ పనుల్ని పరిశీలించారు. హైవే నిర్మాణంతో పాటు మ్యాప్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. జాతీయ రహదారి పొడవు, దానిమీద నిర్మిస్తున్న బ్రిడ్జిలు, భూములు ఇచ్చిన వారి వివరాలు, పరిహారం గురించి పలు శాఖల అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు. రహదారి పనులు ఆటంకం లేకుండా జరగాలని, వినియోగంలోకి వస్తే జిల్లాకే మణిహారంలాగా ఉంటుందని పేర్కొన్నారు. 2025 డిసెంబర్ నాటికి రహదారి నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. బాపట్ల జిల్లాలో ఈ రహదారి 35 కిలోమీటర్ల మేర నిర్మాణం జరుగుతున్నట్లు చెప్పారు. వ్యవసాయంపై ఆధారపడిన బాపట్ల జిల్లాలోని పంట ఉత్పత్తుల్ని ఎగుమతి చేయడానికి మార్గం సుగమం అవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. హైదరాబాద్‌కు తక్కువ సమయంలో చేరుకోవడంతోపాటుగా తీర ప్రాంతాలకు పర్యాటకులు అధికంగా వస్తారని తెలిపారు. నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి త్వరగా నష్ట పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెల్లడించారు. నాణ్యత ప్రమాణాలు పాటించి రోడ్డు నిర్మాణ పనులు చేయాలని సిబ్బందికి సూచించారు. కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ పి.సుబ్బారావు, చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి, పలుశాఖల అధికారులు, రెవెన్యూ, ఆర్ అండ్ బీ, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

జేసీ భార్గవ్ తేజ బాధ్యతల స్వీకారం



గుంటూరు వెస్ట్: గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఎ.భార్గవ్ తేజ బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలను తొలి ప్రాధాన్యతా క్రమంలో ముందుకు తీసుకెళతానన్నారు. అవసరం మేరకు శాసన సభ్యులు, ఎంపీ, మంత్రుల సహకారం తీసుకుంటానని వెల్లడించారు. తాను గతంలో కందుకూరులో సబ్ కలెక్టర్‌గా, తూర్పు గోదావరిలో జాయింట్ కలెక్టర్‌గా, కర్నూలులో మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించానని చెప్పారు. అనంతరం ఆయన కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని మర్యాదపూర్వంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

'స్పేస్' తీసుకుందాం

- అంతరిక్ష విజయాల్లో భారత్ మరింత సత్తా చాటాలి
- విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి
- షార్ సైంటిస్ట్ డైరెక్టర్ ఎ.రాజరాజన్ ఆకాంక్ష
- ఆర్‌వీఆర్‌జేసీలో తొలి జాతీయ అంతరిక్ష దినోత్సవం



ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన నమూనాల వివరాలు తెలుసుకుంటున్న విద్యార్థులు

గుంటూరు రూరల్: ప్రపంచ దేశాల్లో భారత్‌ను శక్తివంతమైన దేశంగా నిలపడమే లక్ష్యంగా విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని షార్ శ్రీహరికోట, సైంటిస్ట్ డైరెక్టర్ ఎ.రాజరాజన్ పేర్కొన్నారు. చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో భారత ప్రభుత్వం, ఇస్రో, శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నేతృత్వంతో నిర్వహిస్తున్న తొలి జాతీయ అంతరిక్ష దినోత్సవ కార్యక్రమంలో రాజరాజన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కళాశాల ప్రాంగణంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న స్పేస్ ఎగ్జిబిషన్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రయాన్–3లాంటి సంక్లిష్టమైన ఓ ప్రయోగాన్ని భారత్ సుసాధ్యం చేసి చూపించిందన్నారు. ఇది భవిష్యత్తులో చేసే ప్రయోగాలకు స్ఫూర్తి దాయకమని, గగన్ యాన్, చంద్రయాన్–4 అంతరిక్ష ప్రయోగాల విజయమే తమ ముందున్న లక్ష్యమని చెప్పారు. అంతరిక్ష పరిశోధనా ప్రయోగాల్లో ప్రపంచ దేశాల్లో భారత్ 4వ స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. 2030 సంవత్సరానికి భారతీయ అంతరిక్ష కేంద్రం నిర్మాణ దిశగా ఇస్రో అడుగులు వేస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు వినూత్న ఆలోచనలతో నూతన శాటిలైట్స్ తయారు చేసే స్థాయికి ఎదగాలని, భవిష్యత్తులో విజయవంతంగా సురక్షితంగా చంద్రుడిపై కాలుమోపే దిశగా పరిశోధనలు సాగుతున్నాయని పేర్కొన్నారు.

పరిశోధనల్లో ముందుండాలి

షార్ డెప్యూటీ డైరెక్టర్ టి.ఎస్.రఘురాం మాట్లాడుతూ విద్యార్థులు సమాజోపయోగ పరిశోధనలు చేయాలని, స్పేస్ టెక్నాలజీని వృద్ధి చేసుకుంటూ విశ్వంలోని ఖనిజ సంపదను వెతికి తీసే పరిశోధనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఆర్‌వీఆర్ జేసీ కళాశాలలో ప్రయోగాత్మక పరిశోధనలకు అనువుగా అన్ని సౌకర్యాలు ఉన్నాయని, తొలి జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలు కళాశాలలో జరుపుకోవడం గొప్ప అవకాశమన్నారు. సమస్త జీవి మనుగడకు స్వచ్ఛమైన గాలి, నీరు మూలాధారమని, వినూత్న ఆలోచనలతో విద్యార్థులు విజయవంత పరిశోధనలు చేయాలని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు

కళాశాలలోని ఐఓటీ విభాగ విద్యార్థులు తయారు చేసిన ఈఎస్‌పీ 32 కెమెరా బేస్డ్ రోవర్, 77 హోమ్ ఆటోమేషన్ యూసింగ్ ఈఎస్‌పీ 8266 మైక్రో కంట్రోలర్, జీపీఎస్ ట్రాకర్ విత్ ఎస్‌ఓఎస్ ఫీచర్ యూసింగ్ సిమ్800ఎల్‌టీటీజీవో మోడెల్, ఆర్డినో బేస్డ్ స్టాటిక్ మోడల్ అండ్ నేమ్ డిస్ప్లే, స్మార్ట్ కార్ పర్కింగ్ యూసింగ్ బ్లాంక్‌క్లౌడ్ అప్లికేషన్, జీపీఎస్ బేస్డ్ డ్రోన్, పర్సనల్ అసిస్టెంట్ విత్ విసువల్ ఎఫెక్ట్ గూగుల్ అసిస్ట్ యూసింగ్ ఈఎస్‌పీ 32, ఆర్డినోయూఎన్‌వో వంటి వివిధ రకాల ప్రొటోటైప్ మోడళ్లను రాజరాజన్, రఘురాం పరిశీలించారు. వాటి పనితీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను ప్రశంసించారు. స్పేస్ ఎగ్జిబిషన్లో పాల్గొన్న వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు 4,200 మంది భారతదేశం ద్వారా విజయవంతంగా జరిపిన అంతరిక్ష ప్రయోగాల రాకెట్ నమూనాలను, ల్యాండ్ ప్యాడ్లను పరిశీలించారు. వాటి పనితీరును తెలుసుకున్నారు. కార్యక్రమంలో అతిథులను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె మద్దినేని, సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ఎస్‌ఎస్‌డి గుంటూరు సబ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టీవీ రమణారెడ్డి, ఎగ్జిబిషన్ కన్వీనర్ డాక్టర్ జి.రామ్మోహన్‌రావు, షార్ శాస్త్రవేత్తలు, కళాశాల వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రిబ్బన్ కట్‌చేసి ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న షార్ సైంటిస్ట్ డైరెక్టర్ రాజరాజన్ తదితరులు

ఎన్‌సీసీ సీనియర్ల దాష్టీకం

- పరీక్ష పేరుతో జూనియర్లను చితకబాదిన వైనం
- నరసరావుపేట ఎస్‌ఎస్ అండ్ ఎన్ కళాశాల హాస్టల్లో అర్ధరాత్రి పైశాచికం
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన.. ఏటా ఇదే తంతు
- కేసు నమోదు చేసిన నరసరావుపేట వన్‌టౌన్ పోలీసులు



జూనియర్‌ను చితకబాదుతున్న సీనియర్లు

సాక్షి, నరసరావుపేట: క్రమశిక్షణకు మారుపేరుగా నిలవాల్సిన ఎన్‌సీసీ సీనియర్ క్యాడెట్లు పైశాచిక ఆనందంతో జూనియర్లను చితకబాదారు. సర్టిఫికెట్ కోసం ఉబికి వస్తున్న కన్నీటినీ దిగమింగుకుని జూనియర్ క్యాడెట్లు బాధను ఓర్చుకున్నారు. ఈ వీడియో ఆలస్యంగా బయటకు రావటంతో ఒక్కసారిగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థిలోకం ఉలిక్కిపడింది. విద్యార్థి సంఘాలు రంగంలోకి దిగి ఘటనపై పూర్తి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.

ఏటా ఇదే తంతు

వజ్రోత్సవాలు జరుపుకోబోతున్న పల్నాడు జిల్లా నరసరావుపేటలోని శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ(ఎస్‌ఎస్ అండ్ ఎన్) కళాశాల స్థాయిలో ఎన్‌సీసీ విభాగం ఉంది. ఇక్కడ ఏటా సీనియర్ విద్యార్థులు జూనియర్లపై వికృతచేష్టలకు పాల్పడడం సర్వసాధారణంగా మారిందనే విమర్శలు ఉన్నాయి. ఏటా బీ సర్టిఫికెట్ పరీక్షకు వెళ్లే క్యాడెట్లను సీనియర్లు విచక్షణారహితంగా వెదురు బెత్తాలతో కొట్టడం ఇక్కడ ఆనవాయితీగా ఉందని సమాచారం. సీనియర్లు కొట్టే దెబ్బలకు చర్మం లేచిపోయి భరించలేని నొప్పితో ఎంతో మంది జూనియర్లు నరకయాతన అనుభవించినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం వైరలైన వీడియోలోనూ సీని యర్లు జూనియర్లను చితకబాదిన దృశ్యాలు కనిపిస్తున్నాయి.

గత ఫిబ్రవరిలో ఘటన

గత ఫిబ్రవరి 3,4 తేదీలలో చీరాలలో జరగనున్న ఎన్‌సీసీ బీ–సర్టిఫికెట్ పరీక్షకు వెళ్లే 20 మంది క్యాడెట్లను సీనియర్లు 2 తేదీ అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు చితక్కొట్టారు. ఆ వీడియో ఇప్పుడు బయటకు వచ్చింది. తమను తమ సీనియర్లు ఇంత కంటే ఎక్కువగా కొట్టారని వీడియోలో కామెంట్ చేయటం ఈ తంతు గత కొన్నేళ్లుగా కొనసాగుతున్నదనేందుకు నిదర్శనంగా ఉంది. క్యాడెట్ల పరేడ్‌ను పర్యవేక్షించాల్సిన ఎన్‌సీసీ ఆఫీసర్ డ్రిల్ సమయంలో ఉండరని విద్యార్థులు బుధవారం చెప్పారు. డ్రిల్ ఉన్న రోజు సాయంత్రం ఆలస్యంగా హాజరయ్యే క్యాడెట్లను క్రమశిక్షణ పేరుతో చిత్రహింసలకు గురిచేస్తుంటారని పేర్కొంటున్నారు.

నోరువిప్పని యాజమాన్యం

ఘటనపై ఎస్‌ఎస్ అండ్ ఎన్ కళాశాల యాజమాన్యం నోరు విప్పడం లేదు. కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్ కళాశాలకు వచ్చి ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య, ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ బి.ఎస్.ఆర్.కె.రాజు, బాధిత విద్యార్థులను తన చాంబర్‌కు పిలిపించుకొని విచారణ చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు ప్రిన్సిపల్ కార్యాలయాన్ని చుట్టుముట్టడంతో ప్రిన్సిపల్ డాక్టర్ మల్లయ్య ఘటనపై విచారణ జరుపుతున్నామని మొక్కుబడిగా ప్రకటించారు.

ఏఐఎస్ఎఫ్ ధర్నా..

ఎన్‌సీసీ జూనియర్ క్యాడెట్లపై సీనియర్ల దాష్టీకాన్ని నిరసిస్తూ బుధవారం ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం, సీపీఐ ఆధ్వర్యంలో ఎస్ ఎస్ అండ్ ఎన్ కళాశాల ఎదుట, హాస్టల్ వద్ద ధర్నా నిర్వహించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు ఎం.నాగేశ్వరరావు, గోపిచంద్, సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి కాసా రాంబాబు, పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, ఉప్పలపాటి రంగయ్య తదితరులు పాల్గొన్నారు.



కళాశాల వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు

కేసు నమోదు

వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో స్పందించిన వన్‌టౌన్ సీఐ కృష్ణారెడ్డి బుధవారం ఉదయం కళాశాల హాస్టల్‌కు వెళ్లారు. అక్కడ దాడిలో గాయపడిన విద్యార్థులను ఘటనపై ఆరా తీశారు. తమపై సీనియర్లు అజయ్‌కుమార్, గోపీకృష్ణ మరో నలుగురు కలిసి దాడి చేశారని సీహెచ్ పాల్ థామస్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. కాగా విచారణ కోరేందుకు కళాశాల హాస్టల్‌కు వచ్చిన మీడియా ప్రతినిధులపై ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ బి.ఎస్.ఆర్.కె.రాజు, సీనియర్ ఎన్‌సీసీ క్యాడెట్లు దురుసుగా ప్రవర్తించారు.



విద్యార్థులను విచారిస్తున్న వన్‌టౌన్ సీఐ

రేపు బీబీసీ చానల్ ప్రత్యేక కార్యక్రమం

ఏఎన్‌యూ(గుంటూరు): బీబీసీ న్యూస్ చానల్ ఈనెల 26న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జర్నలిజం చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనుందని విభాగాధిపతి డాక్టర్ అనిత తెలిపారు. కలెక్టివ్ న్యూస్ రూమ్‌పై నిర్వహించే ప్రజెంటేషన్ ద్వారా జర్నలిజం విద్యార్థులకు ఉపాధి. ఉద్యోగావకాశాలు నూతన కంటెంట్‌ను అభివృద్ధి చేసుకునే స్కిల్స్‌కు సంబంధించిన పలు అంశాలు తెలియజేస్తారని వివరించారు.

దుర్గాఘాట్‌లో మరిన్ని వసతులు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గాఘాట్‌లో భక్తులకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించాలని ఈవో కె.ఎస్.రామరావు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. దుర్గాఘాట్‌ను బుధవారం ఈవో రామరావు ఇంజినీరింగ్, వైదిక కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. ఘాట్‌లో సదుపాయాలను పరిశీలించి స్నానఘాట్ల వద్ద పారిశుద్ధ్యంపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఘాట్‌లో నిత్యం కృష్ణమ్మ ఇచ్చే పంచహారతులపై ఆలయ వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝల శ్రీనివాసశాస్త్రి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడ వసతులపై శ్రీనివాసశాస్త్రి ఆలయ ఈవోకు వివరించారు. ఘాట్‌లో భక్తులకు, పంచహారతులు ఇవ్వడానికి అవసరమైన ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈవో వెంట ఈఈ లింగం రమాదేవి, ఏఈలు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

108 ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు మెడికల్: అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ 108 అంబులెన్సుల్లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌గా (ఈఎంటీ) పనిచేసేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 108 జిల్లా మేనేజర్ జి.నాగదీప్ తెలిపారు. బీఎస్సీ బయాలజీ, బీజెడ్‌సీ, బీఎస్సీ నర్సింగ్, బయో కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, బీఫార్మసీ చదివిన 35 సంవత్సరాల్లోపు వయస్సు ఉన్నవారు అర్హులన్నారు. మంగళగిరి, తుళ్లూరు, కాకుమాను, వట్టిచెరుకూరు, కొల్లిపర, తాడేపల్లి, తెనాలి, తాడికొండలలో ఎంపికైన వారు పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ బయోడేటాను గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయం రెండో ఫ్లోర్‌లోని 108 ఆఫీసులో అందజేయాలని సూచించారు. వివరాలకు 9121892889 నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఏపీ మాల సంఘాల జేఏసీ చైర్మన్‌గా గోళ్ల అరుణ్‌కుమార్

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): ఏపీ మాల సంఘాల జేఏసీ చైర్మన్‌గా మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏపీ, తెలంగాణ మాల సంఘాల ముఖ్యనాయకుల సమావేశం మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్ అధ్యక్షతన బుధవారం గుంటూరులోని అంబేడ్కర్ భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా గోళ్ల అరుణ్‌కుమార్‌ను మాల సంఘాల జేఏసీ చైర్మన్‌గా నాయకులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు పెట్టకుండా ఆగస్టు 9న హలో మాల.. చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జైభీమ్ పీపుల్స్ జేఏసీ జాతీయ అధ్యక్షులు అంబటి కొండలరావు, తెలంగాణ మహిళా అధ్యక్షురాలు బందెల యాదలక్ష్మి, నాయకులు గాజుల పున్నమ్మ, ఎం.నరసప్ప, మేడిద బాబురావు, విప్పర్ల విజయ్‌భాస్కర్, పిల్లి మేరి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3,800, గరిష్ట ధర రూ.5,700, మోడల్ ధర రూ.4,800 వరకు పలికింది.

అంజుమన్‌లో ఏం జరుగుతోంది?

- రహస్యంగా కమిటీ ఏర్పాటు
- తమకు సమాచారం లేదంటున్న వక్ఫ్‌బోర్డు అధికారులు
- మండిపడుతున్న ముస్లిం సంఘాలు



అంజుమన్ ఇస్లామియా కార్యాలయం

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): అంజుమన్–ఏ–ఇస్లామియా కమిటీలో ఏం జరుగుతోంది. ఇప్పుడు గుంటూరులోని ముస్లిం సంఘాలలో ఇదే చర్చనీయాంశమైంది. ప్రస్తుత కమిటీ బాధ్యతల నుంచి తొలగుతున్నందున కొత్త కమిటీ ఏర్పాటు విషయంలో వక్ఫ్ బోర్డు వ్యవహరిస్తున్న తీరు అనుమానాలకు తావిస్తోంది. ఎవరికీ కనీస సమాచారం లేకుండా గుంటూరు తూర్పు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో గుట్టుచప్పుడు కాకుండా కొత్త కమిటీని నియమించినట్లు సమాచారం. గుంటూరు లాలాపేటలోని అంజుమన్–ఏ–ఇస్లామియా కమిటీ కార్యాలయం ఉంది. గుంటూరు అంజుమన్–ఏ–ఇస్లామియా షాదీఖానా, నగరంపాలెంలోని ఈద్గా, స్కూల్ కూడా ఉన్నాయి. వీటికి సంబంధించి ప్రతినెలా సుమారు రూ.3.50 లక్షల ఆదాయం అంజుమన్‌కు వస్తోంది. వీటితోపాటు పెదకాకాని పరిధిలో సుమారు 74 ఎకరాలకుపైగా స్థలం ఉంది. ఇదిలా ఉంటే ఇప్పటివరకూ వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ నేత ముస్తఫా తమ్ముడు కర్నూమా గుంటూరు అంజుమన్–ఏ–ఇస్లామియా కమిటీ అధ్యక్షుడిగా పనిచేస్తూ వచ్చారు.

టీడీపీ అధికారంలోకి వచ్చాక!

అధికార తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నామినేటెడ్ పదవులు, కమిటీలను రద్దు చేస్తోంది. దీనిలో భాగంగా ఇటీవల అంజుమన్–ఏ–ఇస్లామియా కమిటీనీ రద్దు చేశారు. ఈనెల 25న గురువారం కమిటీ అధ్యక్షుడిగా ఉన్న కర్నూమా, కమిటీ సభ్యులు బాధ్యతల నుంచి వైదొలగనున్నారు. కొత్త కమిటీని ఎన్నుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత అధికార పార్టీ ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో కొత్త కమిటీని రహస్యంగా నియమించినట్లు సమాచారం. ఈ విషయాన్ని గోప్యంగా ఉంచాలని వక్ఫ్ బోర్డు అధికారులకు హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది. దీంతో రాష్ట్రస్థాయి వక్ఫ్ బోర్డు కార్యాలయం నుంచి జిల్లాస్థాయి వరకు వక్ఫ్‌బోర్డు అధికారులు తమకు కనీస సమాచారం తెలియదంటూ జారుకుంటున్నారు. ఇదిలా ఉంటే ఇదే తరహాలో 2017లో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో రాత్రికిరాత్రే కమిటీని, అధ్యక్షుడిని బదిలీ చేస్తూ వక్ఫ్‌బోర్డు అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. ఆ సమయంలో తూర్పు శాసన సభ్యుడిగా ముస్తఫా ఉన్నా.. కమిటీలో తెలుగుదేశం పార్టీ తరుపున రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్న స్వర్గీయ హితాయత్ కనుసన్నల్లో కమిటీని రాత్రికిరాత్రే ఏర్పాటు చేశారు. ఇప్పుడూ ఇలానే జరుగుతుండటంతో అంజుమన్–ఏ–ఇస్లామియా కమిటీలో ఏం జరుగుతోందని ముస్లిం సంఘాలు మండిపడుతున్నాయి.

'పశ్చిమ'కు ప్రాతినిధ్యమేదీ!

అంజుమన్–ఏ–ఇస్లామియా కమిటీలో సుదీర్ఘ కాలం నుంచి అధ్యక్ష కమిటీ సభ్యులుగా గుంటూరు తూర్పు నియోజకవర్గానికి చెందిన వారు మాత్రమే కమిటీ సభ్యులుగా ఉంటున్నారు. కమిటీలో పశ్చిమకు ప్రాతినిధ్యం లేకపోవడంపై ముస్లిం మత పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమ నియోజకవర్గంలోనూ ముస్లిం మైనార్టీలు సుమారు 30వేల మందికిపైగా ఉన్నారు. కమిటీలో వీరికి చోటు ఇవ్వకపోవడం సరైంది కాదని ముస్లిం మత పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంజుమన్–ఏ–ఇస్లామియా సంస్థ వక్ఫ్‌బోర్డు ఆధీనంలో నడుస్తుంది కాబట్టి పశ్చిమ నుంచి కూడా కమిటీలో కొందరికి స్థానం కల్పించాలని కోరుతున్నారు. రహస్యంగా నియమించిన కమిటీలోనైనా పశ్చిమ నియోజకవర్గానికి చోటు కల్పించారో లేదో వేచి చూడాల్సి ఉంది.

బియ్యం లారీ స్వాధీనం



చిల్లకల్లులో స్వాధీనం చేసుకున్న బియ్యం లారీ

చిల్లకల్లు(జగ్గయ్యపేట): అనుమానాస్పదంగా ఉన్న బియ్యం లారీని పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన బుధవారం తెల్లవారుజామున చిల్లకల్లులో జరిగింది. కర్ణాటక రిజిస్ట్రేషన్‌తో ఓ లారీ మంగళగిరి నుంచి ముంబైకి వస్తుండగా చిల్లకల్లు వద్ద విధులు నిర్వర్తిస్తున్న పోలీసులకు అనుమానం రావటంతో లారీని ఆపి తనిఖీ చేశారు. లారీలో దాదాపు 20 టన్నుల బియ్యం గుర్తించి తహసీల్దార్ శేషగిరికి సమాచారం అందించారు. రెవెన్యూ అధికారులు బియ్యం పరిశీలించారు. అది రేషన్ బియ్యమా కాదా అని తెలుసుకునేందుకు పౌరసరఫరాల శాఖ ల్యాబ్‌కు పంపుతున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ సరుకు మంగళగిరికి చెందిన వడ్లమూడి శంకర్ రైస్ మిల్లుకు చెందిన యజమాని మహ్మద్ ఖాశీంకు చెందినదని లారీతో పాటు వచ్చిన భాస్కర్ అధికారులకు తెలిపారు. అధికార పార్టీ నాయకులకు చెందినదని ప్రభుత్వ పెద్దల నుంచి ఫోన్ వస్తుందని భాస్కర్ అధికారులను బెదిరించినట్లు సమాచారం.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



నరసరావుపేట టౌన్: గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డీఎస్పీ బంగ్లా సమీపంలో మంగళవారం రాత్రి అమరావతి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్టేషన్ మాస్టర్ ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే ఎస్‌ఐ టి. సుబ్బారావు బుధవారం సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు.

ఆదర్శనీయుడు విశ్వకవి జాషువా

ఏఎన్‌యూలో జాషువా వర్ధంతి



జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఏఎన్‌యూ(గుంటూరు): ఎదుర్కొన్న అవమానాలనే ఆయుధంగా మలచుకుని విశ్వకవిగా ఎదిగిన ఆదర్శనీయుడు గుర్రం జాషువా అని యూనివర్సిటీ బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య పీజే రత్నాకర్ చెప్పారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం యూనివర్సిటీలో గుర్రం జాషువా వర్ధంతిని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కేంద్రం డైరెక్టర్ ఆచార్య రత్నాకర్, పూలే అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఎం.త్రిమూర్తిరావు హాజరై జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య రత్నాకర్ మాట్లాడుతూ మన సమాజంలోని అసమానతలు, వివక్షలు, రుగ్మతలపై అన్ని వర్గాలకు అవగాహన కల్పించి వాటి నిర్మూలనకు సామాన్యులను సైతం సన్నద్ధం చేసేందుకు జాషువా కవిత్వం ఎంతో దోహదం చేసిందన్నారు. బాధలు, అవమాలకు కుంగిపోకుండా కవిత్వం ద్వారా పోరాడిన విశ్వనరుడు జాషువా అని కొనియాడారు. 'గబ్బిలం' రచనను విద్యార్థులు, పరిశోధకులందరూ చదవాలని సూచించారు. పూలే అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య త్రిమూర్తిరావు మాట్లాడుతూ జాషువా కేవలం రచయిత మాత్రమే కాదని గొప్ప సంఘ సంస్కర్త అన్నారు. జాషువా రచనలపై యూనివర్సిటీలో మరింత పరిశోధనలు జరగాలన్నారు. పూలే అధ్యయన కేంద్రం ప్రోగ్రామర్ బి.కోటేశ్వరరావు, డాక్టర్ సీహెచ్ ఇజ్రాయేల్, డాక్టర్ ఎస్ రాజశేఖర్, పరిశోధక సంఘ నాయకులు వై.రాజేష్, ఎస్.శాస్త్రి, సీహెచ్ సునీల్, చంద్రబాబు, ఎస్ ఎజ్రా, పలువురు ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థులు గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వరి మొలక దెబ్బతిన్న చేలల్లో మళ్లీ వెదజల్లాలి

జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు



అధికారులు, రైతులతో నున్నా వెంకటేశ్వర్లు

తెనాలి: లోతట్టు ప్రాంతాలు, మురుగునీటి పారుదల సదుపాయం లేని ప్రదేశాల్లోన వెదజల్లిన వరి మొలక దెబ్బతిందని జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు చెప్పారు. రోజూ వర్షాలు కురవటం, వరద నీరు బయటకు పోయే మార్గం లేక వారంరోజుల పాటు నీరు నిలిచిన చేలల్లో ఈ పరిస్థితి ఉందన్నారు. ఆలస్యంగా వెదజల్లిన చేలల్లోనే ఈ దుస్థితి నెలకొందని పేర్కొన్నారు. వాస్తవానికి ఇటీవల కురిసిన వర్షాలకు వరిచేలల్లో మొలకశాతం బ్రహ్మాండంగా ఉందన్నారు. తెనాలి మండలంలోని హాఫ్‌పేట, నందివెలుగు, తేలప్రోలు గ్రామాల్లోని పంటపొలాలను జిల్లా వ్యవసాయాధికారి నున్నా వెంకటేశ్వర్లు బుధవారం పరిశీలించారు. తెనాలి మండలంలో వరి సాగు విస్తీర్ణం 16 వేల ఎకరాలు కాగా, ఇప్పటికే 14 వేల ఎకరాల్లో వెద పద్ధతిలో సాగు చేస్తున్నారని చెప్పారు. జూలై మొదటివారం నుంచి వెద జల్లటం ఆరంభించారని, క్రమంగా ముమ్మరం చేశారని తెలిపారు. 25 శాతంపైగా మొలక దెబ్బతిన్న పొలాల్లో తిరిగి విత్తనాలను వెదజల్లుకోవాలని వెంకటేశ్వర్లు సూచించారు. గ్రామాల్లోని వీఆర్‌వోలు, వీఏఏల ద్వారా కౌలురైతులు గుర్తింపు కార్డులను పొందాలని నున్నా వెంకటేశ్వర్లు సూచించారు. ఆయనతోపాటు తెనాలి వ్యవసాయ ఏడీఏ ఎస్.ఉషారాణి, మండల వ్యవసాయ అధికారి జి.ప్రేమసాగర్, వీఏఏలు వంశీ, శివతేజ, మౌనిక, అక్తార్ అహ్మద్, రైతులు పాల్గొన్నారు.

ఏపీజీఎల్ఐ ఫైళ్ల పరిష్కారంలో నిబంధనలు పాటించాలి



ఏడీ బాబూరావుకు వినతి పత్రం సమర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ బీమా (ఏపీజీఎల్ఐ) ఫైళ్లను పరిష్కరించడంలో నిబంధనల మేరకు వ్యవహరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.బసవ లింగారావు డిమాండ్ చేశారు. బుధవారం మంగళగిరి రోడ్డులో అన్నపూర్ణ కాంప్లెక్స్‌లోని ఏపీజీఎల్ఐ గుంటూరు శాఖ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ బాబూరావును కలిసిన ఏపీటీఎఫ్ బృందం ఆయనకు వినతి పత్రం సమర్పించింది. బసవ లింగారావు మాట్లాడుతూ కార్యాలయంలో సమర్పించిన బీమా తుది, రుణ చెల్లింపుల్లో తీవ్ర జాప్యం నెలకొంటోందని, ముందుగా వచ్చిన ఫైళ్లను క్లియర్ చేయకుండా వెనుకవచ్చిన వాటిని క్లియర్ చేస్తున్నారని అన్నారు. అవినీతి జరుగుతుందని ఆరోపించారు. రెండు నెలల క్రితం గడువు ముగిసిన ఉపాధ్యాయుల, హెచ్‌ఎంల ప్రతిపాదనలను పరిష్కరించకుండా, 20 రోజుల క్రితం పంపిన వాటిని పరిష్కరించడం తగదన్నారు. సిటిజన్ చార్టర్‌కు భిన్నంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. స్పందించిన బాబూరావు మాట్లాడుతూ సాంకేతిక ఇబ్బందుల దృష్ట్యా, క్లెయిమ్స్ పరిష్కారంలో జాప్యం నెలకొందని, ఉపాధ్యాయుల వివరాల్లో స్పష్టత లేని కారణంగా పలు క్లెయిమ్‌లు పెండింగ్ పడుతున్నాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఏడీతోపాటు సూపరింటెండెంట్ రత్నరాజును కలిసిన వారిలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాలీద్, జిల్లా కార్యదర్శి ఎస్ఎస్ఎన్ మూర్తి, జిల్లా కౌన్సిలర్ పి.అంకారావు ఉన్నారు.

ఏఎన్‌యూ దూరవిద్య సేవల విస్తృతికి కృషి

- సైన్స్ కోర్సులు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రత్యేక చర్యలు
- అందరి సహకారంతో మరింత అభివృద్ధి చేస్తా
- కొత్త డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు



బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లుకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలుపుతున్న రిజిస్ట్రార్ సింహాచలం తదితరులు

ఏఎన్‌యూ(గుంటూరు): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం సేవలు, కోర్సులు మరింత విస్తృతం చేసేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తానని నూతన డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు చెప్పారు. దూరవిద్య కేంద్రం డైరెక్టర్‌గా ఆచార్య వెంకటేశ్వర్లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏఎన్‌యూ దూరవిద్య కేంద్రానికి జాతీయ స్థాయిలో గుర్తింపు ఉందని, మరింత అగ్రస్థానంలో నిలిపేందుకు చర్యలు చేపడతానన్నారు. కొన్నేళ్లుగా ఏఎన్‌యూ దూర విద్యకేంద్రంలో సైన్స్ కోర్సులు నిలిచిపోయాయని, త్వరలో సైన్స్ కోర్సులు అన్ని అనుమతులతో అందుబాటులోకి తెచ్చేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తానన్నారు. ఆర్థిక ఇబ్బందులు, సమయాభావం వల్ల రెగ్యులర్‌గా చదువుకోలేని వారికి, ఉద్యోగాలు చేస్తూ పదోన్నతుల కోసం ఆయా కోర్సులు చదివే వారందరి ప్రయోజనాలు పరిరక్షిస్తూ అన్ని సంస్కరణలు ప్రవేశపెడతామన్నారు. దూరవిద్య కేంద్రం అధికారులు, సిబ్బంది సమష్టి కృషితో విద్యార్థులకు అత్యుత్తమ సేవలు అందిస్తామన్నారు. ప్రస్తుతం ఉన్నత విద్యలో రెగ్యులర్ కోర్సులకు దీటుగా దూరవిద్య కోర్సులను విద్యార్థులకు అందిస్తామన్నారు. దూరవిద్యాకేంద్రం మాజీ డైరెక్టర్ డాక్టర్ బి.నాగరాజు, మాజీ పరీక్షల కో–ఆర్డినేటర్ డాక్టర్ సోమశేఖర్, పలువురు అధికారులు, ఉద్యోగ సంఘ నాయకులు, ఉద్యోగులు, విద్యార్థులు, పరిశోధకులు నూతన డైరెక్టర్‌కు అభినందనలు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన పరీక్షల కో–ఆర్డినేటర్

దూరవిద్య కేంద్రం పరీక్షల కో–ఆర్డినేటర్‌గా ఆచార్య డి.రామచంద్రన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు పలువురు అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. యూనివర్సిటీ రీసెర్చ్‌సెల్ కో–ఆర్డినేటర్‌గా డాక్టర్ పి.సుధాకర్ బాధ్యతలు స్వీకరించారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

ఆర్జేడీకి యూటీఎఫ్ వినతి



ఆర్జేడీ లింగేశ్వరరెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాల విద్యారంగంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బుధవారం యూటీఎఫ్ జిల్లా శాఖ ప్రతినిధులు ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డిని ఆర్జేడీ కార్యాలయంలో కలిసి విద్యారంగ సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. ఆర్జేడీని కలసిన వారిలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, ఏఎల్ శివ పార్వతి, కోశాధికారి ఎండీ గయాసుద్దొలా, జిల్లా కార్యదర్శి సీహెచ్ ఆదినారాయణ, యం. గోవింద్, యు. రాజశేఖరరావు, అడివి శ్రీనివాసరావు ,ఆడిట్ కమిటీ సభ్యులు పి.ప్రేమ్ కుమార్, యం. కోటిరెడ్డి, కె. ప్రభుజీ, ఎండీ షకీలా బేగం, చిన్నయ్య ఉన్నారు.

లేగ దూడలపై కుక్కల మంద దాడి

వేటపాలెం: లలేగ దూడలపై కుక్కల మంద దాడి చేసిన ఘటన బుధవారం తెల్లవారుజామున స్థానిక పాకనాటి వీధిలో జరిగింది. యానాదిరెడ్డికి చెందిన పశువుల పాకపై కుక్కల మంద దాడి చేసింది. రెండు లేగ దూడల్ని కరవగా, అందులో ఒకటి మరణించింది. మరో దూడకు తీవ్ర గాయాలయ్యాయి. వేటపాలెంలో వీధికుక్కలు స్వైర విహారం చేస్తుండటంతో ఈ నెల 15వ తేదీన 'భౌ అంటేనే భయం..' శీర్షికతో 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన పంచాయతీ అధికారులు ఈ నెల 16న వీధి కుక్కల్ని కంటితుడుపుగా పట్టించి చేతులు దులుపుకున్నారు. అయితే, ప్రధానంగా పశువుల పాకల్లో దూడలపై దాడులకు పాల్పడుతున్న కుక్కల మందను మాత్రం పట్టుకోలేదు. దీంతో అవి నిత్యం ఏదో ఒక ప్రాంతంలో దాడులకు తెగబడుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కల్యాణ వేంకటేశ్వరస్వామి గుడిలో చోరీ



యడ్లపాడు: మండల కేంద్రమైన యడ్లపాడులో చోరీ జరిగి 24 గంటలు గడవక ముందే బోయపాలెంలో మరో దొంగతనం వెలుగు చూసింది. బోయపాలెం గ్రామంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి గుడిలోని గంటలతోపాటు పూజా వస్తువుల్ని దుండగులు ఎత్తుకెళ్లారు. బోయపాలెం పరిధిలోని 16వ జాతీయ రహదారి సర్వీసు మార్గం పక్కనే చెరువు ఒడ్డున గుడి ఉంది. 7 కేజీలు, అర కేజీ బరువు కలిగిన ఇత్తడి గంటలు, హారతి పళ్లెం చోరీ అయ్యాయి. నిత్యం పలు వాహనాలు, జనరద్దీ ఉండే ఈ ప్రాంతంలో చోరీ జరగడంపై పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆలయ ధర్మకర్త వడ్డేపల్లి నరసింహారావు తెలిపారు. గతంలోనూ ఇదే గుడిలోని 8 కేజీల ఇత్తడి గంట చోరీ అయిన విషయాన్ని గుర్తు చేశారు. బుధవారం మధ్యాహ్నం గుడి వద్దకు వెళ్లిన సమయంలో గమనించగా గేటు తాళాలు పగులగొట్టి ఉన్నాయని తెలిపారు. లోపలికి వెళ్లి చూడగా సుమారు రూ.10 వేల విలువైన వస్తువులు మాయం అయినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి ఎనలేని కృషి

ఇద్దరికి నగదు, గ్రంథాలయ సేవా పురస్కారాలు అందజేత



గ్రంథాలయ సేవా పురస్కారాలు అందిస్తున్న అతిథులు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గ్రంథాలయాల అభివృద్ధికి అయ్యంకి వెంకటరమణయ్య, వెలగా వెంకటప్పయ్యలు జీవిత కాలం అందించిన సేవలు మరువలేమని పొగాకు బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు కొనియాడారు. అన్నమయ్య సేవా సమితి ఆధ్వర్యంలో గ్రంథాలయ పితామహుడు, పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య, గ్రంథాలయ గాంధీ డాక్టర్ వెలగా వెంకటప్పయ్య పేర్లతో విజ్ఞాన్ విశ్వవిద్యాలయం గ్రంథాలయ అధికారి ఆచంట రజనికుమారి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రాచార్యులు ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మికి రూ.10 వేలు, గ్రంథాలయ సేవా పురస్కారాలను బుధవారం బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై అందజేశారు. సమితి, దేవస్థానం పాలక మండల అధ్యక్షులు సి.హెచ్.మస్తానయ్య జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. విశ్రాంత గ్రంథ పాలకులు పావులూరి శ్రీనివాసరావు సభకు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ కె.జి.శంకర్, డాక్టర్ ఆరేటి కృష్ణకుమారి ఈ పురస్కారాలను పురస్కారగ్రహీతలకు అందజేశారు. అనంతరం నేటి తరుణంలో పుస్తక భవితవ్యం అనే అంశంపై ఉపన్యాసం రజినికుమారి చేశారు. ప్రదానోత్సవంలో లంకా సూర్యనారాయణ, ఆచార్య అయ్యంకి మురళీకృష్ణ, డాక్టర్ వెలగా నాగార్జున, అన్నమయ్య గ్రంథాలయం గ్రంథ పాలకురాలు సుభాషిణి, అయ్యంకి, డాక్టర్ వెలగా వెంకటప్పయ్య, కుటుంబ సభ్యులు, గ్రంథాలయాల అభిమానులు, పాఠకులు పాల్గొన్నారు.

చెస్‌లో రాణిస్తున్న గుంటూరు చిచ్చరపిడుగు



నిర్వాహకుల నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న పర్వతరెడ్డి అజయ్ సంతోష్

రెంటచింతల: చదరంగం పోటీలలో మండల కేంద్రమైన రెంటచింతలకు చెందిన చిన్నోడు పర్వతరెడ్డి అజయ్ సంతోష్ అంతర్జాతీయ ప్రమాణాన్ని (ఐఎం నార్మ్స్) సాధించి ఉమ్మడి గుంటూరు జిల్లా ఖ్యాతిని ప్రపంచానికి చాటాడు. ఉడుముల సాంబ శివారెడ్డి (ఏపీఎస్ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి) మనుమడు అజయ్ సంతోష్ చిన్నప్పటి నుంచి చదరంగంలో నైపుణ్యం ప్రదర్శించేవాడు. తన కన్నా పెద్దవారితో కూడా ఆడుతూ చక్కని ఎత్తులు వేస్తూ అబ్బురపరిచేవాడు. అతడిలో దాగిన ప్రతిభను గుర్తించిన తల్లిదండ్రులు వెంకట మయూర్ బాబు, సంధ్యారాణిలు.. చెస్ మాస్టర్ వద్ద ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. ఈ నెల 9 నుంచి 17వ తేదీ వరకు స్లోవేకియా దేశంలో జరిగిన అంతర్జాతీయ ఓపెన్ చెస్ పోటీలలో అజయ్ సంతోష్ 2400 ఫిడే ఎలో రేటింగ్ పాయింట్లతో ఐఎం నార్మ్స్ సాధించాడు. ఈ పోటీలలో వివిధ విభాగాల్లో బంగారు, రజత, కాంస్య పతకాలతోపాటు నగదు బహుమతులను నిర్వాహకులు చీఫ్ ఆర్బిటర్ ఐఏ దివియక్, రస్టిస్లావ్ చేతులమీదుగా అందుకున్నాడు. ఈ ఏడాది జూన్‌లో కజకిస్థాన్‌లోని అల్మటీ నగరంలో జరిగిన ఆసియా యూత్ చాంపియన్ షిప్ అండర్–18 విభాగంలో దేశానికి ప్రాతినిధ్యం వహించి విశేష ప్రతిభ కనబరిచాడు. దీంతో భారత జట్టు ఓపెన్, ర్యాపిడ్ విభాగాలలో రజత పతకాన్ని సాధించింది. అజయ్ సంతోష్ చదరంగంలో అత్యున్నత స్థాయికి చేరుకుని దేశం గర్వించదగిన క్రీడాకారుడిగా ఖ్యాతి పొందాలని గ్రామ పెద్దలు, వివిధ సంఘాల ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

ఏఎన్ఎంలకు పదోన్నతి కల్పించాలి

గుంటూరు మెడికల్: అర్హత కలిగిన గ్రేడ్–3 ఏఎన్ఎంలకు ఎంపీహెచ్‌ఏ ఫీమేల్‌గా పదోన్నతి కల్పించాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్‌బాషా కోరారు. ఈ మేరకు బుధవారం గుంటూరు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఏఎన్ఎంలకు ఎంపీహెచ్‌ఏగా పదోన్నతి కల్పించాలని, ప్రభుత్వం విడుదల చేసిన గజిట్ నోటిఫికేషన్ ప్రకారం పదోన్నతి కల్పించాలన్నారు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాగానే పదోన్నతులు కల్పిస్తామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూనియన్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కరీముల్లాషా ఖాదరి, కోశాధికారి పోతురాజు, ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ, సంయుక్త కార్యదర్శి కోటా సాహెబ్, నగర ఉపాధ్యక్షుడు వజ్జా పెదరత్తయ్య, సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ, మహిళ విభాగం సహ అధ్యక్షురాలు హేమలత, కార్య నిర్వాహక కార్యదర్శి ఆశాసజని పాల్గొన్నారు.